# మంతిరి గారొచ్చిన్రు

"ఒరే నర్సిమ్మా, బయలుదేరవేందిరా? మంతిరిగారు వస్తున్నరు. మన బడుగువర్గాలకు మేలు చెయ్యడానికి మీటింగెడతన్నరు. ఇక మన కట్టాలన్నీ గట్టెక్కిపోయినట్లే. మన బాదలన్నీ మంతిరిగారితో మనవి చేసుకోవచ్చు." ఉత్సాహంగా అరుస్తున్నాడు సింహాద్రి.

చుట్టుపక్కల గుడిసెల్లో ఉంటున్న వారందరూ బిలబిలమంటూ పరుగెత్తుకొచ్చారు.

"ఏంది దొరా! మల్లీ మంతిరిగారు వత్తుండారా. ఇంతకుమునుపు ఎంతమంది వచ్చినారు. ఎన్ని మీటింగులకు మమ్మల్ని లాక్కెల్లినారు? ఏం మంచి జరిగింది దొరా? ఎందుకు మా పన్లు పాడుజేస్తవు?" అన్నాడు గూడెం పెద్దవెంకన్న.

మెల్లగా నవ్వాడు సింహాద్రి.

"ఒరే వెంకన్నా! ఒక్కసారి మొక్కుకోగానే దేవుడు వరాలిస్తున్నాడా? మనకు ఎంతోమంది దేవుళ్ళున్నట్టే ఎంతోమంది మంతురులున్నారు. అందరికీ మన బాధలు చెప్పుకోవాల. వాళ్ళున్నచోటికి ఎల్లి నానా తిప్పలూ పడే బదులు వాళ్ళొచ్చినపుడే మన బాదలు చెప్పుకోటం మంచిది కదా!" అన్నాడు.

"ఏందోలే బాబూ! రెక్కాడితే గాని డొక్కాడదు. ఒక్కపూట కూలీ పోతే ఆ రోజు పస్తుండాలి" అసహనంగా అన్నాడు వెంకన్న.

"ఒరే పిచ్చినాగన్నా! నేనంత ఎర్రోడిననుకున్నావురా! మీకు డబ్బులిప్పిస్తాను. తిండి పెట్టిస్తాను. లారీల్లో తీసుకెల్లి మల్లా ఇంటికాడ దింపుతరు. హాయిగా పని లేకుండా తిండి దొరుకుతుంటే పెల్లి కెల్లినట్లు పోయిరాక నకరాలు పోతున్నవేందిరా?" అన్నాడు సింహాద్రి.

"సరే కానియ్యండి! నీ మాటకెపుడు ఎదురుచెప్పినాము?" అన్నాడు మరొక పెద్ద నర్సింహ.

"మరి పదండి, లారీ రెడీగా ఉంది" అన్నాడు సింహాద్రి ఆనందంగా.

లారీ దగ్గరకు వస్తున్న జనాన్ని చూస్తుంటే సింహాద్రి ఆనందానికి అవధులు లేవు. మీటింగుకు లారీలలో జనాన్ని తోలుకెళ్ళడానికి పార్టీపెద్దలతో కాంట్రాక్టు కుదుర్చుకున్నాడు మరి. తల ఒక్కింటికి వంద రూపాయలు. ఈ వెధవలందరకూ పాతికో పరకో ఖర్చు పెట్టినా తనకు బాగానే గిట్టుబాటవుతుంది. ఆ డబ్బుతో ఊళ్ళో తను కట్టుకుంటున్న ఇంటిని పూర్తిచేసుకోవాలి. ఇంతకు ముందు ఇలాగే కూడబెట్టిన డబ్బుతో జాగా అమర్చుకున్నాడు. ఈ మధ్య ఎలక్షన్లు లేక, మీటింగులు లేక తనకుగిరాకీ తగలడంలేదు. జనం కూడా తెలివి మీరుతున్నారు. వాళ్ళను తీసుకెళ్ళడానికి నానా తంటాలు పడవలసివస్తున్నది.

★ ★ ★

"అమ్మా! నే మీటింగుకెల్లొస్తనే!" అన్నాడు నర్సింహ తల్లితో.

"బువ్వ కెసరెట్టినా. తిని ఇంత సద్ది కట్టుకెల్లు. ఆడ చానా కట్టమవుద్ది" అన్నది వరాలమ్మ.

"ఒసే నాపిచ్చితల్లీ! బువ్వేందుకే దండగ. ఆడ అన్ని ఫిరీగా ఎడతరు. పైగ డబ్బులిత్తరు. అది నువ్వే తినవే." అన్నాడు నర్సింహ తల దువ్వుకుంటూ.

"నీ యిట్టం, నాయనా! జాగరతగా ఎల్లి బేగిరా!" అన్నది వరాలమ్మ.

★ ★ ★

అయినా వరాలమ్మకు మనసాగలేదు. అంతమంది జనంలో వాడికి బువ్వ దొరుకుతుందో లేదో అని తాను అన్నం మూట కట్టుకుని బస్తీకి బయలుదేరింది.

బస్టాండులో నిల్చుంది. బస్సులన్నీ జనంతో కిటకిటలాడుతున్నాయి. బస్సుల లోపలే కాక టాపు మీద కూడా ఎక్కారు జనం. వచ్చిన ప్రతి బస్సూ ఎక్కడానికి ప్రయత్నిస్తున్నది. కానీ జనం తోపులాటలో ఎక్కలేక వెనుకబడిపోతున్నది.

"బాబ్బాబు, నన్ను ఒక్కదాన్ని ఎక్కనియ్యండయ్యా!" అందరినీ బ్రతిమలాడుతున్నది.

ఆమె ప్రాణాలన్నీ కొడుకు మీదే ఉన్నాయి. తినడానికి ఏమైనా దొరికిందో, లేదో! జేబులో పైసలున్నాయే లేదో? అసలే వాడికి మొగమాటం. ఎలాగైనా బస్తీ జేరి కొడుక్కు సద్ది అందివ్వాలని ఆ ముదుసలి ఆరాటం.

ఆమె మాతృప్రేమను అర్థం చేసుకున్నట్లుగా మరో బస్సు కొంచెం ఖాళీగా వచ్చింది. సీటు లేకపోయినా కిందనే మూలబడి బస్తీ చేరింది.

బస్తీలో అంతా గందరగోళంగా ఉంది. ఎటు చూసినా రంగురంగుల జెండాలు, తోరణాలు, అడుగడుగునా పోలీసులు. ఎటు వెళదామన్నా అడ్డుకునే కార్యకర్తలు, పోలీసులు. ఎటు పోవాలో పాలుపోవడంలేదు.

మంతిరిగారు వచ్చారో, లేదో? ఎవర్ని ఏమడిగినా కసురుకుంటున్నారు. ఏదో యిద్ధం జరుగుతున్నట్టు జనం కకావికలై ఒకటే పరుగులు. ఎవరి ఆరాటం వారిది. ఓట్లు కావలసివచ్చినప్పుడు ఇంటిదాకా వచ్చి ప్రేమ వలికించి కాళ్ళా వేళ్ళా పడుతుంటారు. గెలిచిన తరువాత మళ్ళీ కంటికి కనపడడు. ముక్కూ ముఖం తెలియనివాడు తమకేదో చేస్తాడని వెర్రి జనాల కెంత ఆశ!

జనం లక్షల్లో ఉన్నారు. తన కొడుకు కోసం ఎలా వెదకటం? పోలీసులు జనాన్ని వీధికుక్కల్ని తరిమినట్లుగా తరుముతున్నారు. వాళ్ళ లాఠీ దెబ్బతిననివాడే అదృష్టవంతుడు.

రోడ్డు పక్కన రకరకాల తినుబండారాలు అమ్ముతున్నారు. కొంతమంది మంచినీటి కుండలు ముందు పెట్టుకుని నీళ్ళు ఇస్తున్నారు. తినడానికి డబ్బుల్లేవు. కనీసం మంచినీళ్ళయినా తాగుదామని ఓ కుండ వద్దకు వెళ్ళింది వరాలమ్మ.

"అమ్మీ ఒక గలాసు నీళ్ళిస్తావా?" అడిగింది.


"గలాసు అర్ధరూపాయి. ఎన్ని కావాలి?" అన్నది కుండ యజమాని.

"ఓలమ్మో! నీళ్ళు కూడా అమ్ముతున్నారా?" విచిత్రంగా అడిగింది వరాలమ్మ.

"మరిఉత్తపున్నానికే రావడానికి నీ బాబు నా బాబు తవ్వించిన ఊట సెరువులైమైనా ఉన్నాయనుకున్నావా?" ఈసడింపుగా అన్నది కుండ యజమాని.

మరోవైపు గుప్పెడు మెతుకుల పులిహోర పొట్లాలు ఒక్కొక్కటిరెండు రూపాయలకమ్ముతున్నారు.

"మా ఊరి గుళ్ళో ఇంతకు రెండింతలు పులిహోర ప్రసాదంగా పెడతారు. ఆ యింత ముద్దరెండు రూపాయలా?" బుగ్గలు నొక్కుకుంది వరాలమ్మ.




పావలా వస్తువులు రూపాయికి అమ్ముతున్నారు. అయినా జనం ఎగబడి కొంటున్నారు. తింటున్నారు.

పైన ఎండ మండిపోతున్నది. కింద జనం మాడిపోతున్నారు. నర్సింహ ఎక్కడున్నాడో?

ఎండను నెత్తినెత్తుకుని, ఆకలిని, దాహాన్ని ఆసరా చేసుకుని ఆలోచనలను అక్కున చేర్చుకుని వెళ్తున్న వరాలమ్మకు పోలీసోడి గర్జన ఉలిక్కిపడేలా చేసింది.

"ఒసే ముసిల్దానా! ఆడోళ్ళు అటెళ్ళాలి. అటు పో!" అని లాఠీతో ఒక్క తోపు తోశాడు.

"అయ్యా! అయ్యా! నా కొడుకు బాబూ! పొద్దుననగా కాలే కడుపుతో వచ్చిండు. ఎంగిలి కూడా చెయ్యలేదు. వాడికి బువ్వ పట్టుకొచ్చినా! వదులు దొరా! నీ కాలు మొక్కుతాను!" బ్రతిమలాడింది వరాలమ్మ.

"ఒసి పిచ్చిదానా! వాడెక్కడున్నాడని పట్టుకుంటావు! తినటానికి బయట బోలెడు అమ్ముతున్నారు. మీటింగుకొచ్చినందుకు పైసలు బాగానే ఇచ్చి ఉంటారు. ఏదోకటి తిని ఉంటాడు. నువ్వెళ్ళు!" పెద్దగా నవ్వాడు పోలీసు.

పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణసంకటంలా ఉంది వరాలమ్మ పరిస్థితి.

వరాలమ్మకు పౌరుషం తన్నుకొచ్చింది.

"ఓరికోసం బాబూ ఇదంతా? ఈ మీటింగెట్టి ఎవరిని బాగుచేస్తరు? మాకు మేలు జరగటం దేవుడెరుగు గానీ అటెల్లద్దు ఇటెల్లద్దు అని మమ్మల్ని కుక్కల్ని తరిమినట్లు తరుముతుండరు. కూలిపనికి బోకుండా నా కొడుకు మీటింగని ఈడకొచ్చిండు. కడుపునిండునా కాలునిండునా మాకు? యాపారాలు జేసే టోల్లంతా రూపాయిది నాలుగు రూపాయలమ్మి సొమ్ము దోచుకుతింటున్నారు. ఆకరికి మంచినీల్లు కూడా అమ్ముతుండరు. ఎవడికోసం బాబూ ఈ జాతరంతా?" ఒక్క కోపంతో విరుచుకుపడ్డది.

పోలీసు ఏ మూడ్లో ఉన్నాడో కానీ నిట్టూర్పు విడిచాడు.

"మాకు మాత్రం సరదాగా ఉందటే ముసిల్దానా? పొద్దుట్నించి అరిచి అరిచి గొంతుపోయింది. నిలబడి నిలబడి కాళ్లు పీక్కుపోతున్నాయి. తిండి తిప్పలు లేవు. రాజుల కాలంలో బానిసలకు ఈ పెజాస్వామ్యంలో పోలీసుకు తేడాలేదు. పోపో... లోపలకు పో" అన్నాడు.

మైకుల్లో సినిమాపాటలు హోరెత్తిపోతున్నాయి. కిటకిటలాడుతున్న జనం. ఎండకు మాడుతూ బయటకు పోవడానికి దారిలేక, కూలబడటానికి చోటులేక, ఎందుకొచ్చామురా దేవుడా అని మీటింగులోని జనం అనుకుంటుంటే ఇక్కడేదో కొంపలు మునిగిపోయినట్లు దూరం నుంచి తండలు తండలు జనం పరుగెత్తుకొస్తున్నారు.

"ఓరినాయనో... ఇంతమంది వస్తున్నరు. ఇంతమందికి డబ్బులిస్తున్నడంటే ఆ మంతిరి ఎంత సంపాదించాడో కదా?" బుగ్గలు నొక్కుకుంది వరాలమ్మ.

ఇదేమాట పక్కనున్న మరో ముసలమ్మతో అన్నది.

"ఔనమ్మా. ఎంత డబ్బు వురదా జేస్తున్నడు? ఈ ఖర్చుతో మనబోటోళ్లకు వెయ్యిమంది కొంపలు కట్టించొచ్చు, సగం జిల్లాలో బోరింగులెయ్యొచ్చు. ఎంతమంది గరీబు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చెయ్యొచ్చు!" అంటూ గుండెలు బాదుకుంది ముసలమ్మ.

ఇంతలో బజార్లో దుమ్మంతా లేపుకుంటూ రివ్వున పాతిక కార్లు జనం మధ్యనున్న రోడ్డు మీదగా రాసాగాయి. కార్యకర్తలు పిచ్చికుక్కల్లా అరుస్తున్నారు.

రోడ్డుపక్కనే నిలుచున్న జనం కళ్లల్లోకి, ముక్కుల్లోకి, నోళ్లలోకి దుమ్ము దూసుకుపోయింది.

"థూథూ... మంతిరే జనం నోళ్లల్లో దుమ్ము కొడుతుంటే వారి కార్లు మాత్రం ఊరుకుంటాయా?" అని కళ్లు చిట్లిస్తు క్రింద ఉమ్మేయసాగింది వరాలమ్మ.

మంత్రి కంటె ఎత్తు, లావు ఉన్న పూలదండలను మోసుకుంటూ ఆయాసంతో కార్లవద్దకు పరుగెత్తి మంత్రి దిగగానే మెడలో వేయసాగారు ఛోటా నాయకులు.

ఇంతలో ఒకాయన స్టేజీ ఎక్కి మైకు అందుకున్నాడు.

"మహాజనులారా! మంత్రిగారు రావడం ఐదుగంటలు ఆలస్యమైనా ఓపికతో కూర్చున్నందుకు మీకు ధన్యవాదాలు.

డైరెక్టర్ : పురాతన వస్తువులు వెలికి తీయమని నిధులు ఇస్తే నీ ఇంట్లో, నీ బంధువుల ఇంట్లో బావులు తవ్వించుకున్నావట.
ఆఫీసర్ : పురాతన వస్తువులు దొరుకుతాయనే తవ్వకాలు జరిపాము సార్—కానీ నీళ్ళు పడ్డాయ్.
సి. డి. ఏలీషా, నల్లగొండ



"మరి కిరాయి తీసుకున్నపుడు తప్పుతుందా?" జనంలో ఎవరో అరిచారు.

వెంటనే గొల్లుమని నవ్వులు.

ప్రజల ఇళ్లకు వాకిళ్లకు కాపలా కాయవలసిన పోలీసుల్లో నలుగురైదుగురు అటువైపు పరుగెత్తుకెళ్లి అరిచినవాళ్లను లాఠీలతో బాదారు.

"శాంతం...శాంతం" మైకాసురుడు అన్నాడు. "దయచేసి మా ప్రజలను బాధించవద్దు. మన బలహీనవర్గాలకు వరాలిచ్చి ఆదుకోవడానికి మంత్రిగారు ఎంతో శ్రమపడి ఇక్కడకు వచ్చారు. అమూల్యమైన మంత్రిగారి సందేశాన్ని విని జేజేలు పలకమని మీ అందరికి దండాలు పెడుతున్నాను" అని దిగాడు.

మంత్రిగారు ముకుళిత హస్తాలతో 'అందరికీ దండాలు' అంటూ స్టేజీ ఎక్కారు.

"అమ్మో! ఏందీయన పాతసినిమాల్లో యస్వీ రంగారావు లాగున్నడు. చూస్తుంటే ఐదు నిముషాల్లో ఏభైమందిని ఏటకొడవలితో నరికిపారేసేవాడిలాగా ఉన్నడు" అన్నది వరాలమ్మ.

"ఇంతకుముందు కసాయికొట్టు నడిపేటోడు సుడిదిరిగి మంతిరైండు" దూరాన అనుకుంటున్నారెవరో.

మంత్రిగారు ఉపన్యాసం మొదలుపెట్టారు. భాష భయంకరంగా ఉన్నది. కంఠస్వరం కర్ణకఠోరంగా ఉన్నది. రాబోయే ఎలక్షన్లలో తమ పార్టీకి, తనకు ఓటు వెయ్యమనడం మినహా మరేమీ అర్థం కాలేదు వరాలమ్మకు.

"గీ మాత్రం జెప్పడానికా ఇంతమందిని పిలిచిండ్రు? ఒక్కముక్క పేపర్లో ఏస్తే అందరికీ ఒకేమారు తెలుస్తదిగదా!" అన్నది వరాలమ్మ ఎవరితోనో.

మీటింగు అయిపోయింది. జనం అంతా గబగబ తోసుకుంటూ లారీల కోసం బయటకు పరుగెత్తసాగారు. ఎవరికివారే ముందుగా బయటపడి కొంపకు జేరాలన్న తాపత్రయంలో అవతలవారి సంగతి పట్టించుకోవడం లేదు.

ఆ తొక్కిసలాటలో వెనక్కు పోలేక, ముందుకు పోలేక 'నర్సిమ్మా నర్సిమ్మా' అని కేకలు పెడుతున్నది వరాలమ్మ భయంతో.

ఎవరో నెట్టగానే కిందపడబోయి నిలదొక్కుకుంది. అంతలోనే ఆమెను భయం ఆవరించింది.

"ఓరి నర్సిమ్మో... ఎక్కడున్నావురో... కొడుకా... జాగ్రత్తరో కిందపడితే మళ్లీ లేవడం కట్టం నర్సిమ్మా...?" గొంతు చించుకుని అరవసాగింది.

కానీ ఆ మహాజన సముద్రంలో ఆ కేకలు ఎవరికీ వినపడటంలేదు. వరాలమ్మను ఎవ్వరూ పట్టించుకోవడంలేదు.

కానీ పేగుబంధానికి ఆ కేకలు వినపడ్డాయి. అల్లంత దూరంలో ఉన్న నర్సింహ జనవాహినిని చీల్చుకుంటూ ఆత్రంగా రాసాగాడు.

"నువ్వీడ కెందుకొచ్చినావే ముసిల్దానా. మాలాంటి పోరగాళ్లే నలిగి ఛస్తుంటే నువ్వెందుకొచ్చావే... చెయ్యిపట్టుకో..." అని చేయి జాపుతూ అన్నాడు నర్సింహ.

కొడుకును చూసిన ఆనందంలో బారెడు దూరంలో ఉన్న కొడుకు చెయ్యి అందుకోబోయింది వరాలమ్మ.

"సద్ది తెచ్చినాను కొడకా... ఎంగిలి పడుదుగానిరా" అంటూ ముందుకు కదిలింది.

అంతలోనే మరో పాతికమంది బిలబిలా వరాలమ్మను తోసుకుంటూ ముందుకు పరుగెత్తారు.

ఆ తోపుడు వేగానికి కిందపడింది వరాలమ్మ.

"అమ్మా" గావుకేక పెట్టాడు నర్సింహ. ఎవ్వరూ పట్టించుకోలేదు. కొన్ని వందల జతల కాళ్లు వరాలమ్మను తొక్కుకుంటూ వెళ్లాయి.

ఆకాశం బద్దలయ్యేలా ఏడ్చాడు నర్సింహ.

★ ★ ★

ఊళ్లో సింహాద్రి రెండంతస్తుల బంగళా చూసినపుడల్లా "మంతిరిగారు వచ్చిన్రా, మనకు మేలు చేసిన్రా?" అని అమ్మ అంటున్న మాటలు నర్సింహ చెవుల్లో గింగురుమనంటూనే ఉంటాయి.

కొత్త లెక్చరర్ : ఏంటండీ! వాళ్ళందరూ మహాభారత్ సీరియల్‌లో లాగా వేషాలు వేసుకుని యుద్ధం చేస్తున్నారు.
ప్రిన్సిపాల్ : మా కళాశాలలో హిస్టరీ ప్రాక్టికల్స్ ఇలాగే జరుగుతాయి జవాబిచ్చాడు ప్రిన్సిపాల్.
కారపు వెంకటేశ్వర్లు, ఆదిలాబాద్

